సాక్షి సిద్దిపేట

మంగళవారం, 4 మార్చి 2025



వినూత్న ఆలోచన..

పంటలను కాపాడుకునేందుకు రైతులు వినూత్న ఆలోచనలు చేస్తున్నారు.

వివరాలు 8లో ▸



చెరువులు నింపాలని..

తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి చెరువులను నింపాలని కోరుతూ అధికార పార్టీ నేతలు కోరారు.

వివరాలు 9లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళవారం సా. 6.28 గం.	బుధవారం ఉ. 5.10 గం.

న్యూస్‌రీల్

నేడు హర్యానా గవర్నర్ రాక

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి దర్శనానికి మంగళవారం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ రానున్నారు. గవర్నర్‌తో పాటు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఉదయం ఆలయానికి చేరుకుంటారని పార్టీ మండల అధ్యక్షుడు బూర్గోజు నాగరాజు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపు నిచ్చారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో జిల్లా నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని పార్టీ జిల్లా నాయకులు కలిశారు. సోమవారం నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు జిల్లా అధ్యక్షుడు శంకర్ తెలిపారు. తనతో పాటు జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి వేణుగోపాల్, మాజీ కౌన్సిలర్ వెంకట్, సీనియర్ నాయకులు ఉన్నారన్నారు.

8న జాతీయ లోక్‌అదాలత్

జిల్లా న్యాయమూర్తి స్వాతిరెడ్డి



సిద్దిపేటకమాన్: జాతీయ లోక్‌అదాలత్ ఈనెల 8న నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి తెలిపారు. సిద్దిపేట కోర్టు భవనంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. రాజీపడదగిన కేసుల్లో కక్షిదారులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. గత లోక్‌అదాలత్‌లో 5వేల కేసుల వరకు పరిష్కరించినట్లు తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బుగ్గరాజేశ్వరుడి ఆలయ ఆదాయం రూ.5.21లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు

సిద్దిపేటరూరల్: మహాశివరాత్రి సందర్భంగా స్వయంభూ బుగ్గరాజేశ్వరస్వామి ఆలయ ఆదాయం రూ.5.21లక్షలు వచ్చినట్లు చైర్మన్ కరుణాకర్ తెలిపారు. భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. హుండీ ద్వారా రూ.2,43,748, టిక్కెట్ల రూపంలో రూ.2,77,732 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సీతారామశర్మ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు వసతులు కల్పించండి



కూలీలతో మాట్లాడుతున్న శంకర్

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉపాధి హామీ కూలీలకు పని జరిగే చోట వసతులు కల్పించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అనంతసాగర్‌లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో కూలీలకు పని ప్రదేశంలో నీడ వసతి, తాగు నీటి సౌకర్యం, ప్రాథమిక చికిత్స వంటివి ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. ఆయన వెంట డీబీఎఫ్ నాయకులు ఉన్నారు.

కిష్టయ్యకి ఉగాది పురస్కారం

సిద్దిపేటఅర్బన్: పిల్లిట్ల కిష్టయ్యకి జాతీయ స్థాయి ఉగాది విశ్వశాంతి పురస్కారం దక్కింది. చిందు యక్షగాన కళా రంగంలో అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి అవార్డు ఇచ్చారు. సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లికి చెందిన పిల్లిట్ల కిష్టయ్య నగరంలో జరిగిన కార్యక్రమంలో పురస్కారం దుడపాక శ్రీధర్ చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని కిష్టయ్య అన్నారు.

ఇంటర్ పరీక్ష.. దూరమే పెద్ద శిక్ష



చాలా దూరంలో పలు ఎగ్జామ్ సెంటర్లు

వెళ్లి రాయాలంటే ప్రైవేటు వాహనాలే దిక్కు ● సమయానికి చేరుకోవాలంటే తప్పని తిప్పలు

రేపటి నుంచే పరీక్షలు ప్రారంభం ● జిల్లాలో 43 కేంద్రాలు.. 20,595 మంది విద్యార్థులు

ఇంటర్ పరీక్షా కేంద్రాలు దూరంగా ఉండటంతో విద్యార్థులకు అసలు 'పరీక్ష' ఎదురుకానుంది. అసలే ఎండలు.. ఆపై బస్సు సౌకర్యం లేకపోవడం.. సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలంటే పెద్ద పరీక్షనే ఎదుర్కోనున్నారు. బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరగనున్నాయి. ఉదయం 8:45 వరకే పరీక్ష కేంద్రం లోపలికి అనుమతిస్తారు. 5 నిమిషాల వరకు గ్రేస్ పీరియడ్ ఇచ్చారు. వివిధ గ్రామాల నుంచి పలు పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలంటే తిప్పలు తప్పని పరిస్థితి నెలకొంది. పరీక్ష కేంద్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

సాక్షి విజిట్

సాక్షి, సిద్దిపేట: ఇంటర్ పరీక్షలు ఈ నెల 5 నుంచి 25 వరకు జరగనున్నాయి. జిల్లాలో 20,595 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరి కోసం 43 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో మొదటి సంవత్సరం 9,770 మంది ఉండగా జనరల్ 7,161 మంది, ఒకేషనల్ 2,619 మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సరం 10,815 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో జనరల్ 8,243, ఒకేషనల్ 2,572 మంది పరీక్ష రాయనున్నారు.

మూడు కిలోమీటర్ల దూరం



గజ్వేల్‌లోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ జూనియర్ కళాశాల

గజ్వేల్‌రూరల్: పట్టణంలో మొత్తం ఎనిమిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని బస్టాండ్ నుంచి సంగాపూర్ రోడ్డు లోగల బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చేరుకునేందుకు 3 కిలోమీటర్ల దూరం ఉంటుంది. బాలికల, బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లకు ప్రతినిత్యం మూడు ఆర్టీసీ బస్సులు ఉదయం, సాయంత్రం వేళల్లో నడుస్తున్నాయి. అయితే పరీక్షా కేంద్రానికి ఉదయం 8:45గంటలకే చేరుకోవాలనే నిబంధన ఉంది. ఈ మార్గంలో ఎడ్యుకేషన్ హబ్ వరకు ఎలాంటి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. ఈ పరీక్షా కేంద్రంలో నిత్యం సుమారు 400 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు అధ్యాపకులు పేర్కొన్నారు.

ప్రయివేటు వాహనాలే దిక్కు

జగదేవపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ రెండు సెంటర్లలో సుమారు 838 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. అయితే మండల కేంద్రానికి ప్రభుత్వ కళాశాల సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. పరీక్ష రాసే విద్యార్థులకు రవాణా కష్టాలు తప్పడం లేదు. రెండు కేంద్రాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలు ఆటోల ద్వారా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సిన పరిస్థితి ఉంది. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు తిప్పలు తప్పని పరిస్థితి. జగదేవపూర్ నుంచి భువనగిరి వెళ్లే ప్రతి బస్సు కళాశాల వద్ద ఆపేలా అవకాశం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.



జగదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

23కిలోమీటర్లు ప్రయాణించాల్సిందే

కొమురవెల్లి: మండలానికి చెందిన ఇంటర్ విద్యార్థులకు ముస్త్యాల మోడల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రం కేటాయించారు. దీంతో విద్యార్థులకు దాదాపు 23 కిలో మీటర్లు దూరం ప్రయాణ భారం కానుంది. రెండు బస్సులు మారితేనే పరీక్ష కేంద్రానికి చేరుకుంటారు.

● కుకునూరుపల్లిలో ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయలేదు. ఆ కళాశాల విద్యార్థులకు కొండపాక, గజ్వేల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు సుమారు 15 కిలోమీటర్లు వెళ్లాలి.

గురువన్నపేట వరకు నడిచి రావాలి



మాది కొమురవెల్లి మండలం గురువన్నపేట. ముస్త్యాల మోడల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రం కేటాయించారు. అయినాపూర్ వరకు నడిచి వచ్చి చేర్యాలకు బస్సు ద్వారా చేరుకుంటాం. కానీ పరీక్ష టైమ్‌కు బస్సులు లేవు. ప్రైవేటు వాహనాలే దిక్కు. ప్రత్యేక బస్సుల ఏర్పాటుకు అధికారులు చొరవ చూపాలి

– అనురూప్, గురువన్నపేట

బస్సు సౌకర్యం కల్పించాలని కోరాం



ఇంటర్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు సమయానికి చేరుకునేలా బస్సుల సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ డీఎంలను కోరాం. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేశాం. సీసీ కెమెరా నిఘాలో పరీక్షల నిర్వహణ ఉంటుంది.

– రవీందర్ రెడ్డి, డీఐఈఓ

పకడ్బందీగా నిబంధనలు అమలు: సీపీ



సిద్దిపేటకమాన్: జిల్లాలోని ఇంటర్మీడియెట్ పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ నిబంధనలు అమలులో ఉంటాయని సీపీ అనురాధ తెలిపారు. ఈ నెల 5 నుంచి 25వ తేదీ వరకు నిబంధనలు అమల్లో ఉంటాయన్నారు. పరీక్షలు జరుగు సమయంలో సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లు మూసి వేసివేయాలని, కేంద్రం నుంచి 500మీటర్ల వరకు ప్రజలు గుమికూడి ఉండకూడదన్నారు. పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటుచేశామన్నారు.

అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలు

● భయాందోళనతో పరుగులు తీసిన రైతులు

● మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది

కొండపాక(గజ్వేల్): మండలంలోని ఖమ్మంపల్లి అటవీ ప్రాంతంలో సోమవారం ప్రమాదవశాత్తు పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. వ్యవసాయ బావుల వద్ద ఉన్న రైతులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. వ్యవసాయ బావి వద్ద ఉంచిన వల్లంగల్ల రాములుకు చెందిన ట్రాక్టర్, టైర్లు కాలిపోగా ఇతర రైతుల వ్యవసాయ పరికరాలు, పండ్ల తోటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అటవీ ప్రాంతానికి సమీపంలో ఖమ్మంపల్లి ఉండటంతో స్థానికులు వెంటనే ఫారెస్టు అధికారులకు, పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న అధికారులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. రాత్రి వేళ అయితే మంటలు గ్రామంలోకి వ్యాపించి తీవ్ర నష్టం జరిగేదంటూ ఆవేదనకు గురయ్యారు. మంటలను ఆర్పే ప్రయత్నంలో త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ చూపిన చొరవకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

జిల్లాలో సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలు

● సిద్దిపేట మార్కెట్‌లో ప్రారంభం

● రైతులు సద్వినియోగం చేసుకోవాలి: అదనపు కలెక్టర్

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలో సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని సోమవారం అధికారులు ప్రారంభించారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో పొద్దు తిరుగుడు సాగు చేసిన రైతులకు ఉపయోగపడనుంది. బహిరంగ మార్కెట్లలో ప్రయివేటు వ్యాపారులు మద్దతు ధర కంటే తక్కువగా కొనుగోలు చేస్తున్నారు. పత్తి మార్కెట్ యార్డులో ప్రభుత్వం కేంద్రాన్ని అందుబాటులోకి తేవడంతో రైతులకు క్వింటాల్‌కు మద్దతు ధర రూ.7,280 లభించనుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి..

ప్రభుత్వం సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. పత్తి మార్కెట్ యార్డులో పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా11,193 ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంట సాగు అయినట్లు పేర్కొన్నారు. దిగుబడి అంచనా మేరకు జిల్లాలో సిద్దిపేట, హుస్నాబాద్, బెజ్జంకి, గజ్వేల్, తొగుట, చిన్నకోడూరు, అక్కన్నపేట ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు ప్రక్రియ జరగనుందని, రైతులు నిబంధనల మేరకు నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతు ధర పొందాలని సూచించారు. నూనె గింజలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మాత్రమే విక్రయించాలని, దళారులకు అమ్మొద్దని సూచించారు. కార్యక్రమంలో మార్క్ ఫెడ్ డీఎం క్రాంతి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, జిల్లా సహకార శాఖ అధికారి నాగమణి, తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉంటే.. మాజీమంత్రి హరీశ్‌రావు సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలంటూ సీఎంకు లేఖ రాసిన విషయం విదితమే.

వేసవిలో లోవోల్టేజీ రానివ్వం

● నిరంతరం విద్యుత్ సరఫరా

● జిల్లా నోడల్ ఆఫీసర్ సాయిబాబ

దుబ్బాక: వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ కమర్షియల్, జిల్లా నోడల్ ఆఫీసర్ సాయిబాబ అన్నారు. సోమవారం దుబ్బాక మండలం అప్పనపల్లి, సిద్దిపేట మండలంలోని చిన్నగుండవెల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా లోడ్ మానటరింగ్ తో పాటు రైతులకు నాణ్యమైన కరెంట్ ఇవ్వడంపై విద్యుత్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎక్కడా లోవోల్టేజీ సమస్య రానివ్వబోమన్నారు. కరెంట్ సమస్య లేకుండా ముందస్తుగానే చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ చంద్రమోహన్, డీఈఈ టెక్నికల్ శ్రీనాథ్, డివిజనల్ ఇంజనీర్ రామచంద్రయ్య, ఏడీఈ కృష్ణమోహన్, దుబ్బాక సబ్‌డివిజన్ ఏడీఈ గంగాధర్, దుబ్బాక రూరల్ ఏఈ జయకృష్ణ ఉన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం రాయపోల్ మండలం ఆరేపల్లి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తరగతి గదిలో పిల్లల సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వినియోగించే కూరగాయలు, వంట పాత్రలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని భోజన కార్మికులకు సూచించారు. పాఠ్యాంశాల్లో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

హుస్నాబాద్: ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలికల విద్యాలయాన్ని (అక్కన్నపేట) ఆమె సందర్శించారు. స్టోర్ రూంలోని నిత్యావసర వస్తువులను పరిశీలించారు. విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా గరిమా అగర్వాల్ మాట్లాడుతూ విద్యార్థినులు బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. విద్యపై ప్రత్యేక దృష్టి సారించి రానున్న పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.

సాగునీరు విడుదల చేయండి

రోడ్డుపై బైఠాయించిన రైతులు

సిద్దిపేటరూరల్: అంకంపేట చెరువులోకి నీటిని విడుదల చేసి, పంటలను రక్షించాలని అంకంపేట గ్రామస్తులు సోమవారం లక్ష్మీదేవిపల్లి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లన్నసాగర్ కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేసి నెల రోజులు గడుస్తున్నా అంకంపేటకు నీళ్ళు వదలడం లేదన్నారు. అంకంపేట చెరువు కింద 350 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని, పంటలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వెంటనే నీటిని వదిలి రైతులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం ధర్నా వద్దకు చేరుకున్న రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ అపూర్వరెడ్డి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.



అంకంపేట రైతుల నిరసన


కేంద్రం నుంచి రావాల్సిన నిధులకు కిషన్‌రెడ్డే అడ్డు

● కేసీఆర్ బినామీగా బండి సంజయ్ వ్యవహరిస్తుండు

● తెలంగాణలో అభివృద్ధి జరగడం వారికి ఇష్టం లేదు

● మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్

హుస్నాబాద్‌రూరల్: కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. సోమవారం హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి విలేకరులతో మాట్లాడుతూ కిషన్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అభివృద్ధి జరగడం ఇష్టంలేదని, అందుకే నిధులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులకు ప్రతిపాదనలు ఇచ్చి నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినా కేంద్రం ఎందుకు నిధులు ఇవ్వడంలేదని పొన్నం ప్రశ్నించారు. వరంగల్ ఎయిర్ పోర్టు తన వల్లనే వచ్చిందని పక్క రాష్ట్రం కేంద్ర మంత్రితో చెప్పించుకోనే దుస్థితి కిషన్‌రెడ్డికే దక్కిందన్నారు. వరంగల్ ఎయిర్ పోర్టు కోసం ఏనాడైనా కిషన్‌రెడ్డి ప్రయత్నం చేశారా? అని మంత్రి ప్రశ్నించారు. మరో కేంద్రమంత్రి బండి సంజయ్ కేసీఆర్‌కు బీనామీగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తెలంగాణ అభివృద్ధిలో మీకు బాధ్యత లేదా? నిధులు రాకుండా ఎందుకు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. తమిళనాడు వంటి రాష్ట్రాలు అభివృద్ధి కోసం కలిసికట్టుగా పని చేస్తాయని, మన కేంద్ర మంత్రులు అభివృద్ధికి ఎందుకు సహకరించడం లేదన్నారు. రాష్ట్రానికి కేంద్ర నిధులు తేవడం కిషన్‌రెడ్డికి ఇష్టం లేదన్నారు. అభివృద్ధిని అడ్డుకునే కుట్రలను సహించబోమని, అభివృద్ధి నిరోధకులుగా కేంద్ర మంత్రులు ఎందుకు వ్యవహరిస్తున్నారో చెప్పాలన్నారు. మీకు అభివృద్ధి చేయాలనే ఆలోచనే ఉంటే హైదరాబాద్ నుంచి రామగుండం వరకు రాజీవ్ రహదారిని 8 వరుసలకు విస్తరించాలని డిమాండ్ చేశారు. కుల గణన సర్వే పై బీఆర్ఎస్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. సర్వేలో పాల్గొనని వారికి ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు అవకాశం ఇచ్చామని, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు స్వయంగా నేను సర్వే పత్రాలను పంపించిన సర్వేలో వారి వివరాలను ఇవ్వలేదన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

క్లుప్తంగా

సెల్‌ఫోన్ విషయంలో గొడవ

ఇంటి నుంచి వెళ్లి వివాహిత అదృశ్యం


పవిత్ర

శివ్వంపేట(నర్సాపూర్): వివాహిత అదృశ్యమైన ఘటన మండల పరిధి తిమ్మాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన గొల్ల నాగరాజుతో కొల్చారం మండలం కృష్ణాపూర్ గ్రామానికి చెందిన పవిత్రకి 7 నెలల కిందట వివాహం జరిగింది. పుట్టింటి నుంచి పవిత్ర సెల్‌ఫోన్ తెచ్చుకోవడంతో ఆదివారం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అనంతరం నాగరాజు పనికి వెళ్లిపోయి సాయంత్రం వచ్చేసరికి భార్య ఇంట్లో కనిపించలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య అదృశ్యంపై నాగరాజు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెళ్లికొచ్చి వృద్ధుడు అదృశ్యం

జిన్నారం (పటాన్‌చెరు): వృద్ధుడు అదృశ్యమైన ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మాదారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం శివారులోని కొలన్ హనుమంత రెడ్డి ఫంక్షన్ హాల్‌లో 2న ఓ వివాహ కార్యక్రమం జరిగింది. ఈ వివాహానికి సాయిరెడ్డి (62) కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. పెళ్లయిన అనంతరం అతడు ఫంక్షన్ హాల్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం గాలించినా ఫలితం దక్కలేదు. బాధితుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి కేసులో నిందితుల అరెస్టు


నిందితులతో పోలీసులు

జహీరాబాద్: మట్టిని తరలిస్తున్న వారిని ప్రశ్నించినందుకు గ్రామస్తులపై దాడి చేసిన కేసులో సోమవారం నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఫిబ్రవరి 28 రాత్రి 12 గంటల ప్రాంతంలో కోహీర్ మండలంలోని మదిరి గ్రామ శివారులోని వక్ఫ్ భూమిలో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వహీద్ అలీ, వహీద్, ఫాహద్, ఫిరోజ్‌లను మదిరి గ్రామానికి చెందిన వారు ప్రశ్నించారు. దీంతో వారు గ్రామస్తులపై దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అనంతరం విచారణ జరిపి నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు.

కూతురి వివాహానికి డబ్బులు అందడం లేదని

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మనోహరాబాద్(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. మనోహరాబాద్ మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామానికి చెందిన పిట్ల రాజు (44) కూలీ పనులు చేసుకుంటూ రాజుకు భార్య, ఇద్దరు కూతుళ్లతో జీవిస్తున్నాడు. రాజు నూతనంగా ఇల్లు నిర్మించగా అప్పులయ్యాయని, నెల రోజుల కిందట పెద్ద కూతురు వివాహం నిశ్చయమైంది. కూతురి పెళ్లికి డబ్బులు పుట్టకపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన రాజు సాయంత్రమైన రాకపోవడంతో చుట్టుపక్కల వెతకగా శివారులో చెట్టుకు డ్రిప్‌పైపుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న కుమారుడు పిట్ల సదేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌కు నిప్పు

సంగారెడ్డి క్రైమ్: ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌కు గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. ఈ ఘటన సంగారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన పట్నం అరుణ వాణి గృహిణి. 2న రాత్రి రెండు గంటల సమయంలో బయటకొచ్చి చూడగా ఇంటి ఎదుట పార్కు చేసిన తన కుమారుడి బైక్ కాలిపోయి ఉంది. గుర్తు తెలియని దుండగులు బైక్‌కు నిప్పంటించారని ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICE

■ మీ బంగారం మణప్పురం, ముతూట్, మార్వాడీ షాప్స్,ఏఇతర ఫైనాన్స్‌లోఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [H-783412]

WANTED

■ **Mythry Agri Seeds Pvt Ltd.** Wanted Seed Marketing Executives. HQ: Medak (2) HQ : Siddipet. 3 to 5 years Experiences. Ph: 6281348977 [H-1214127]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వినూత్న ఆలోచన.. పంటకు రక్షణ


పంట చుట్టూ ఏర్పాటు చేసిన పాత చీరలు


చెట్టుకు వేలాడదీసిన ఖాళీ సీసాలు

పంటలపై జంతు జీవాలు దాడి

- కాపాడుకునేందుకు రైతుల కొత్త ఆలోచన
- పొలాల చుట్టూ పాత చీరలు ఏర్పాటు
- పాలిథిన్ కవర్లు, ఖాళీ సీసాలు వినియోగం
- సంరక్షణ చర్యలతో సత్ఫలితాలు

సంగారెడ్డి జోన్: రైతులు వ్యవసాయం చేయాలంటే ఎన్నో కష్ట నష్టాలను ఎదుర్కోవాలి. విత్తనం వేసిన నాటి నుంచి పంట చేతికొచ్చేంత వరకు రైతులు నానా రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. పంటలపై పశువులతోపాటు జంతు జీవాలు దాడులు చేస్తున్నాయి. పంటలను ఏ విధంగానైనా రక్షించుకోవాలని లక్ష్యంతో తమకు తోచిన ఆలోచనను అమలు చేసి కొంతమేర రక్షించుకోగలుగుతున్నారు. సులభమైన పలు పరిష్కార మార్గాలను కనుగొంటున్నారు. పంటల చుట్టూ చీరలు, పాలిథిన్ కవర్లు, ఖాళీ సీసాలు ఏర్పాటు చేసుకొని కంటి రెప్పలా కాపాడుకుంటున్నారు.

జిల్లాలో యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు వినూత్న ఆలోచనలు చేస్తున్నారు. పక్షులతోపాటు అడవి పందులు, కోతులు, కుందేళ్ల పంటలపై దాడులు చేస్తున్నాయి. జిల్లాలోని ఝరాసంగం, న్యాల్‌కల్, జహీరాబాద్, మునిపల్లి, రాయికోడ్, కోహీర్ తదితర మండలాల్లో నీటి సౌకర్యం ఉన్న రైతులు జొన్న, మొక్కజొన్న, శనగ, చెరుకు పంటలను సాగు చేస్తుంటారు.

పాత వస్తువులతో కొత్త ఐడియాలు

జిల్లాలో ముఖ్యంగా సాగులో ఉన్న జొన్న, మొక్కజొన్న, చెరుకు, శనగ, బొప్పాయి పంటలపై దాడి చేస్తున్నాయి. ప్రస్తుతం ఆయా పంటలు లేత దశలో ఉండటంతో వాటిని తినేందుకు వస్తుంటాయి. కంకులను తిన్న తర్వాత మిగితా వాటిని నాశనం చేస్తున్నాయి. ఈ తరుణంలో రైతులు పంటలను కాపాడుకోవడానికి వివిధ రకాల పద్ధతులను ఉపయోగిస్తున్నారు. పాత చీరలతో పంట చుట్టూ కంచె మాదిరిగా ఏర్పాటు చేసుకొని అడవి పందుల బెడద నుంచి కాపాడుకుంటున్నారు. ఖాళీ బీరు సీసాలతో పొలం గట్లపై ఉన్న చెట్లకు వేలాడదీస్తున్నారు. గాలులు వీచిన సమయంలో సీసాలతో వచ్చిన చప్పుడుతో పక్షులు బెదిరిపోతున్నాయి.

రైతుల సరికొత్త ఆలోచనలు

పంటలు సాగు చేసే రైతులు పక్షులు, జంతువులు దాడి చేస్తుండడంతో అధైర్య పడకుండా తమకు వచ్చిన వినూత్న ఆలోచనలతో పంటలను కాపాడుకుంటున్నారు. ఎవరిపై ఆధారపడకుండా పంటలను రక్షించుకుంటూ దిగుబడులు పొందుతున్నారు. రైతులు అమలు చేసే చిరు ప్రయత్నాలు మంచి సత్ఫలితాలు ఇస్తున్నాయని చెబుతున్నారు.

పాలిథిన్ కవర్లు, సౌండ్ రికార్డులు


బొప్పాయి తోటలో ఏర్పాటు చేసిన పాలిథిన్ కవర్లు

పర్యావరణానికి ముప్పుగా ఉన్న పాలిథిన్ కవర్లు పంట రక్షణకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. విత్తనం వేసిన చెరుకు పంటతోపాటు వివిధ రకాల పంట పొలాల మధ్యలో కర్రలను ఏర్పాటు చేసి వాటికి ప్లాస్టిక్ కవర్లను కట్టుతున్నారు. గాలివీచిన సమయంలో వచ్చే చప్పుళ్లతో పక్షులతోపాటు జంతువులు పరారవుతున్నాయి. మెమొరీ కార్డు, ఛార్జింగ్, సౌండ్ రికార్డింగ్ కలిగి ఉన్న బాక్స్‌లను వినియోగిస్తున్నారు. ఫలితంగా రాత్రుల సమయంలో పక్షుల బెడద తగ్గిందంటున్నారు. అంతే కాకుండా వాహనాలకు వినియోగించే ఇంజన్ ఆయిల్ వాడిన తర్వాత ఆయుర్వేద మందులు కలిపి పంట చుట్టూ చీరతో కట్టడంతో అడవి పందుల బెడద తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. ప్లాస్టిక్ వాటర్ డబ్బాలు తాడుతో చుట్టి పంట చుట్టూ కడుతున్నారు. ఈ విధంగా పంటలను కొంతమేర రక్షించుకోగలుగుతున్నామని రైతులు పేర్కొంటున్నారు.

ఎండిన పంటలకు పరిహారం అందించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి


ఎండిన పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): యాసంగిలో ఎండిన వరి పంటకు ప్రభుత్వం రైతులకు పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని లెనిన్‌నగర్ గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ఎండిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొమురవెల్లి మండలంలో కరువు కాటకాలను దూరం చేసేందుకు తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నిర్మించారని అన్నారు. ప్రతీ సంవత్సరం తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి ఈప్రాంత చెరువులను నింపి రైతులకు సాగు నీరు అందించేవారని దీంతో భూగర్భజలాలు పెరుగడంతో బోరు బావులలో పుష్కలంగా నీరు ఉండేదని అన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వం రియర్వాయర్‌లోకి నీరు విడుదల చేయకపోవడంతో నీరు లేక పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిన పంటలు ఎకరాకు రూ.50 వేలు పరిహారంగా అందించాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి, మండల కార్యదర్శి తాడూరి రవీందర్, దాసరి ప్రశాంత్, దాసరి చక్రపాణి పాల్గొన్నారు.

పిల్లలకు వినికిడి పరీక్షలు నిర్వహించాలి

సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి


మాట్లాడుతున్న డాక్టర్ నాగరాజు

సిద్దిపేటకమాన్: మూడేళ్ల వరకు ఉన్న చిన్న పిల్లలకు తప్పకుండా వినికిడి పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి, ఈఎన్‌టీ విభాగ హెచ్‌ఓడీ కే.నాగరాజు తెలిపారు. జాతీయ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సోమవారం ఈఎన్‌టీ విభాగ వైద్యుడు డాక్టర్ కడవేర్గు ప్రణీత్‌తో కలిసి డాక్టర్ శాంతి, డాక్టర్ నాగరాజు మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రిలో డెలివరీ అయిన బాలింతలకు, పిల్లల తల్లిదండ్రులకు వినికిడి సమస్యలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతీ బేబీకి డిశ్చార్జీకి ముందు తప్పకుండా ఈఎన్‌టీ విభాగ వైద్యులతో వినికిడి పరీక్షలు నిర్వహించాలన్నారు. పిల్లలకు వినికిడి సమస్య ఉంటే భవిష్యత్‌లో వారికి మాటలు కూడా సరిగా రాకపోవడానికి అవకాశం ఉంటుందన్నారు. నెలలు నిండకుండా, బరువు తక్కువగా జన్మించిన పిల్లలకు తప్పకుండా వినికిడి పరీక్షలు చేయించి, ఏదైనా సమస్య ఉంటే చికిత్స తీసుకోవాలని తెలిపారు. ఫ్లకార్డులతో వైద్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చందర్, ఆర్‌ఎంలు డాక్టర్ జ్యోతి, డాక్టర్ శ్రావణి, డాక్టర్ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ఘటన

పటాన్‌చెరు టౌన్: అప్పుల బాధతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ కాలనీకి చెందిన శ్రీనివాస్ రెడ్డి (34) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. భార్య గర్భిణి కావడంతో పుట్టింటి వద్ద ఉంటుంది. కొంతకాలంగా శ్రీనివాస్‌రెడ్డి ఆర్థిక ఇబ్బందులతో సుమారు రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పుల బాధ తాళలేక సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య వాసవి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటికి సమీపంలో ఉన్న ఆమె చెల్లెలు సాయి చందనకు ఫోన్ చేసి చెప్పింది. వెంటనే ఆమె ఇంటికి వెళ్లి కిటికీలోంచి చూడగా బావ శ్రీనివాస్ రెడ్డి ఉరేసుకొని కనిపించాడు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి మరదలు సాయి చందన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ దుర్గయ్య కేసు నమోదు చేశారు.

మిత్రుడి వివాహానికి వచ్చి వెళ్తూ..

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మరో యువకుడికి తీవ్ర గాయాలు

నర్సాపూర్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ లింగం కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన సాయి నిఖిల్(21), అతడి మిత్రుడు మనీశ్ ఆదివారం మెదక్‌లో జరిగిన వారి మిత్రుడి వివాహానికి హాజరయ్యారు. రాత్రి ఇంటికి తిరిగి ప్రయణమయ్యారు. నర్సాపూర్ మీదుగా హైదరాబాద్ వెళ్తుండగా నర్సాపూర్ శివారులోని అయ్యప్ప దేవాలయం సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న రెయిలింగ్‌కు బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న నిఖిల్ అక్కడికక్కడే మృతి చెందగా వెనుక కూర్చున్న మనీశ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అనంతరం మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి తరలించారు. బైక్‌ను అతి వేగంగా అజాగ్రత్తగా నడిపినందునే అదుపుతప్పి ప్రమాదం జరిగిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

బైక్ ఢీకొని వృద్ధుడు


పెంటయ్య

కొండపాక(గజ్వేల్): బైక్ ఢీకొట్టడంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన కొండపాకలో చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామానికి చెందిన తోడేటి పెంటయ్య(60) సమీప గ్రామమైన మేదినీపూర్‌లో జరిగిన వివాహానికి హాజరయ్యాడు. సాయంత్రం వేళ కొండపాకలోని అత్తారింటికి నడుచుకుంటూ వెళ్తుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వెళ్తున్న బైక్ తిమ్మారెడ్డిపల్లి శివారులో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కోరుట్లకు చెందిన వినోద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి


సాయికుమార్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బిజ్లిపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుకర్ రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన నెల్లూరి సాయికుమార్(35) శనివారం రాత్రి మద్యం మత్తులో చేపల వేటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆదివారం గ్రామ పరిసరాల్లోని చెరువులు, కుంటల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం గ్రామ శివారులోని వీరప్ప చెరువు లో సాయి కుమార్ మృతదేహం తేలడంతో గుర్తించారు. చేపల వేటకు వెళ్లి నీట మునిగి మృతి చెందినట్లు మృతుడి చెల్లి శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో..


రత్నయ్య (ఫైల్)

పాపన్నపేట(మెదక్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మల్లంపేటలో సోమవారం ఉదయం వెలుగు చూసింది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. మల్లంపేట గ్రామానికి చెందిన గంగన్నోల్ల రత్నయ్య(55), లక్ష్మీ దంపతులకు కూతురు ఉషాల ఏకైక సంతానం. 12 ఏళ్ల కిందట ఆమెను అదే గ్రామానికి చెందిన బాల్‌రాజ్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆరేళ్ల నుంచి ఉషాల, బాల్‌రాజ్ దంపతులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లోని బాచేపల్లిలో ఉంటున్నారు. రత్నయ్య ప్రతిరోజూ రాత్రి స్వగ్రామంలోని కూతురు ఇంటికి కాపలాగా నిద్రిస్తుంటాడు. రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి నిద్రకు వెళ్లిన అతడు సోమవారం ఉదయం చూసేసరికి కూతురు ఇంట్లో ఉరేసుకొని కనిపించాడు. ఇంటి ఎదుట వాకిట్లో పేక ముక్కలు ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు. రత్నయ్య పనీపాట లేకుండా పేకాట, మద్యం వ్యసనాలతో గడుపుతుంటాడని, భార్య కూలీ పనులు చేస్తూ కుటుంబం పోషిస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు. తన తండ్రి మరణంపై అనుమానం ఉందని కూతురు ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అదృశ్యమైన యువకుడు శవమై లభ్యం

మరో 20 రోజుల్లో మృతుడి వివాహం


పడవల ద్వారా మృతదేహాన్ని తీసుకొస్తూ..

న్యాల్‌కల్(జహీరాబాద్): అదృశ్యమైన యువకుడు శవమై కనిపించిన ఘటన మండల పరిధిలోని హుమ్నాపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్ఐ చల్లా రాజశేఖర్ కథనం మేరకు.. నాగుల్‌గిద్ద మండలం గంగారం తండాకు చెందిన సునీల్ చౌహన్ హైదరాబాద్‌లో ఉంటూ కొంతకాలంగా పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం కోసం పిట్లంలోని ఆస్పత్రికి వస్తున్నానని, అనంతరం ఇంటికొస్తానని 1వ తేదీన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఇంటికొస్తానన్న కుమారుడు రాకపోయే సరికి ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పలుమార్లు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆదివారం సునీల్ వాహనం పుల్కుర్తి బ్రిడ్జిపై పోలీసులకు లభించిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని గాలింపు చేపట్టగా సోమవారం ఉదయం మంజీరా నదిలో శవమై కనిపించాడు. కుమారుడి మృతిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆస్తి కోసం కన్నతల్లిని కడతేర్చిన కొడుకు

- మద్యం మత్తులో కత్తితో దాడి
- మృతురాలి శరీరంపై ఆరు కత్తిపోట్లు
- సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఘటన


మృతురాలు రాధిక (ఫైల్)


నిందితుడు కార్తీక్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆస్తి కోసం కన్నతల్లినే కడతేర్చాడు ఓ కసాయి కొడుకు. మద్యం మత్తులో కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. రక్తపు మడుగులో పడి ఉన్న ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ దారుణ ఘటన సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని డివినో విలాస్‌లో నివాసముండే నవారి రాధిక(52), భర్త మాల్లారెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సందీప్ రెడ్డికి గతేడాది వివాహం జరిగింది. రెండో కుమారుడు కార్తీక్ రెడ్డి మద్యానికి బానిసయ్యాడు. కొంత కాలంగా తనకు రావాల్సిన ఆస్తిని పంచితే తాను వ్యాపారం చేసుకుంటానని నిత్యం తల్లిదండ్రులతో గొడవ పడేవాడు. మద్యానికి బానిస కావడంతో కార్తీక్ రెడ్డిని గతేడాది రెండు సార్లు రియబ్‌టేషన్ సెంటర్‌కు పంపించారు. జనవరి నెలలో తిరిగి ఇంటికొచ్చాడు. మళ్లీ ఆస్తి విషయంపై గొడవ పడుతూ వస్తున్నాడు. కార్తీక్ రెడ్డి ఆదివారం రాత్రి మద్యం సేవించి ఇంటికొచ్చాడు. సోమవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో ఇంట్లో తనకు ఆస్తి పంచాలని పెద్దపెద్దగా అరవడం మొదలుపెట్టాడు. తల్లి రాధిక నిద్రలేచి ఏమైందంటూ అనడంతో ఆమెపై కత్తితో దాడి చేశాడు. తండ్రి మల్లారెడ్డి అడ్డుకునేందుకు ప్రయత్నించగా అతడిపై దాడి చేశాడు. వెంటనే అతడు బయటకు పరిగెత్తి కాపాడాలంటూ గట్టిగా కేకలేశాడు. సందీప్ రెడ్డి సైతం భయంతో బయటకు వచ్చి తల్లిని కాపాడాలంటూ కేకలేశాడు. అందరూ కలిసి లోనికి వెళ్లి చూడగా రాధిక రక్తం మడుగులో పడి ఉంది. వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఉదయం 10 గంటల సమయంలో మృతి చెందింది. సమాచారం అందుకున్న కొల్లూరు ఎస్ఐ రవీందర్, మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి శరీరంపై ఆరు కత్తిపోట్లు ఉన్నట్లు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు కార్తీక్ రెడ్డిని సోమవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పోలీసులతో దురుసు ప్రవర్తన

వ్యక్తి కేసు నమోదు

నర్సాపూర్: విధి నిర్వహణలో ఉన్న ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మూసాపేట గ్రామానికి చెందిన ప్రవీన్ 100 నబంర్‌కు ఫోన్ చేసి తన అక్క రేణుకను బావ సురేశ్ కొడుతున్నాడని ఫిర్యాదు చేశాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు మోహన్, భిక్షపతి గ్రామానికి వెళ్లి సురేశ్‌కు నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా అతడు పోలీసులను ఇష్టం వచ్చినట్లు బూతులు తిడుతూ వారి చొక్కాలు పట్టుకొని కొట్లాటకు దిగాడు. తమ కుటుంబం జోలికి వస్తే చంపేస్తానని బెదిరించాడు. ఈ విషయాన్ని తెలుసుకొని పెట్రోలింగ్ డ్యూటీ చేస్తున్న ఏఎస్ఐ క్రిష్ణ గ్రామానికి వెళ్లగా సురేశ్ ఏఎస్ఐని సైతం తిట్టాడని ఎస్ఐ పేర్కొన్నారు. తమ విధులకు ఆటంకం కలిగించి దురుసుగా ప్రవర్తించినందుకు కానిస్టేబుళ్లు మోహన్, భిక్షపతిల ఫిర్యాదు మేరకు సురేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు లింగం వివరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పటాన్‌చెరు టౌన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా సీతారామపురం గ్రామానికి చెందిన నీలకంఠేశ్వర రావు(30) ఏడాది కిందట బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో ఉంటున్నాడు. ఇక్కడే ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. 2న రాత్రి డ్యూటీ ముగించుకొని ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. సుల్తాన్‌పూర్ గ్రామ సమీపంలోని కల్యాణ్ వెంచర్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి స్పీడ్ బ్రేకర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం తరలించగా సోమవారం మృతి చెందాడు. మృతుడి పెద్దనాన్న కుమారుడు సోమేశ్వర రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దుర్గయ్య తెలిపారు.

పరీక్షల వేళల మార్పు వెనక్కి తీసుకోవాలి

హుస్నాబాద్: పరీక్షల వేళల మార్పును వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాకేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ రంజాన్ మాసం పేరు చెప్పి పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్ష వేళల్లో మార్పులు చేయడం తగదన్నారు. మధ్యాహ్నం వేళలో పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. ఉదయం వేళల్లోనే నిర్వహించేలా మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రాహుల్, చరణ్, సంతోష్, అంజి, కార్తీక్ తదితరులు ఉన్నారు.

రైతుబజార్‌లో కొనుగోళ్లు ప్రారంభించాలి

హుస్నాబాద్: పట్టణంలో కొత్తగా నిర్మించిన రైతు బజార్ భవన్‌లో కొనుగోళ్లు ప్రారంభించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శికి సోమవారం వినతి పత్రం ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ రైతులు పండించిన కూరగాయలు అమ్ముకోవడానికి ప్రభుత్వం రూ.3 కోట్లతో రైతుబజార్‌ను ఏర్పాటు చేసిందని, ప్రారంభించకపోవడంతో రైతులు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సునీత, మల్లారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘స్వయం పరిపాలన’



ఘనపురం పాఠశాలలో విద్యార్థులు


విద్యార్థులతో ఉపాధ్యాయులు

చేర్యాల(సిద్దిపేట): దొమ్మాట మండల ప్రజాపరిషత్ పాఠశాలలో సోమవారం స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాలలో ఐదోతరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి తోటి వారికి పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు కుమార స్వామి, రవిందర్‌రెడ్డి, స్వరూప పాల్గొన్నారు.

ఘనపురం పాఠశాలలో..

తొగుట(దుబ్బాక): మండలంలోని ఘనపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎంగా శీర్షిక, ఎంఈవోగా వంశీ, డీఈఓగా నిహారిక, ఆర్జేడీగా ఇందు వ్యవహరించారు.

బార్‌లో మంటలు

చేర్యాల(సిద్దిపేట): బార్ అండ్ రెస్టారెంట్ వంటగదిలో మంటలు చెలరేగిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. స్థానిక ప్రవీణ్ బార్ అండ్ రెస్టారెంట్ వంటగదిలోని పొగ బయటకు వెళ్లే చిమ్నీ పైప్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో పక్కనే విద్యుత్ వైర్లు తగలబడ్డాయి. మందు తాగడానికి వచ్చిన వారు మంటలను చూసి భయంతో పరుగులు తీశారు. వంట గదిలో షార్ట్ సర్క్యూట్ కావడంతోనే మంటలు చెలరేగి ఉంటాయని స్థానికులు వాపోతున్నారు. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ ఎస్ఐ సురేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎలాంటి నష్టం జరగలేదని తెలిపారు.